క్లుప్తంగా

స్కౌట్స్, గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో చదువుతూ 2023–24 విద్యా సంవత్సరంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొంది క్యాంప్‌నకు హాజరైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ సోపాన సర్టిఫికెట్లను మంగళవారం ప్రదానం చేశారు. హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు మాట్లాడుతూ.. ఇటీవల సంభవించిన వరదల సమయంలో బాధితులకు అందించే సహాయ కార్యక్రమాల్లో స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులు పాల్గొని తమ వంతు సేవలు అందించారని పేర్కొన్నారు. తొలుత స్కౌట్స్ వ్యవస్థాపకుడు లార్డ్ బౌడెన్ పోవెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ ఉపాధ్యాయులు బి.ఎస్.వరకుమార్, హైస్కూల్ కమిటీ కార్యదర్శి శ్యామ్ ప్రకాష్, ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): పాత రాజరాజేశ్వరి పేట రైల్వే స్థలాల్లో నివసిస్తున్న వారికి వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశాడు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ నాలుగు రోజులుగా పాత ఆర్‌ఆర్‌పేట ఎర్రకట్ట డౌన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులకు ఆయన మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నివసిస్తున్న వారిని ఒక్కసారిగా ఖాళీ చేయాలని రైల్వే అధికారులు ఆదేశించడం అన్యాయమన్నారు. పేదలు నివసిస్తున్న స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఆందోళన చేస్తున్న స్థానికులకు సీపీఎం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బత్తుల పాండు, సయ్యద్ షాహీన్, ఖుర్షీద, అప్సర్, రమణమ్మ, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఫ్లోర్ కూల్చివేత



పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ నుంచి అనుమతి లేకుండా పటమటలో అదనపు అంతస్తు వేయగా వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కూల్చివేశారు. పటమటలోని కరణం బజారులో చెన్ను గంగాధరరావు వీఎంసీకి భవనంలో కొంతభాగాన్ని మార్టిగేజ్ చేయాల్సి ఉండగా చేయకుండా ఫ్లోర్ వేశారు. దీనిపై వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారి జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్ ఆదేశాలతో టీపీఎస్ వసీంబేగ్ సంబంధిత భవన యజమానికి నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ భవన నిర్మాణ అనుమతులకు సంబంధిత డాక్యుమెంట్‌ను యజమాని సమర్పించకపోవటంతో షార్ట్‌ఫాల్‌కి వెళ్లింది. దాన్ని సరిచేసుకోకపోవటంతో మంగళవారం వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం ఆక్రమణల నిరోధ కార్మికులు భవన స్లాబును కూల్చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న భవనాలకు షార్ట్‌ఫాల్ ఉంటే వెంటనే వాటిని సరిచేసుకోవాలని లేని పక్షంలో భవనాలను కూల్చేస్తామని చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్ హెచ్చరించారు.

అలరించిన సంగీత విభావరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించిన సంగీత విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మంగళవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం విజయవాడ కేదారిశెట్టి అనూష బృందం సంగీత విభావరి ప్రదర్శించింది. తొలుత దేవస్థానం ఆస్థాన మేళ బృందం డోలు, సన్నాయిలపై అమ్మవారి కీర్తనలను ఆలపించి భక్తులను రంజింపజేసింది. అనంతరం కళాకారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందజేశారు.

పాత ఆర్‌ఆర్‌పేట వాసుల్లో అలజడి

ఇళ్లు ఖాళీ చేయాలంటూ రైల్వే అధికారుల దండోరా

- 5 దశాబ్దాలుగా రైల్వే స్థలాల్లో నివసిస్తున్న పేదలు
- ఆందోళన చెందుతున్న 950 కుటుంబాల వారు
- స్థలాన్ని ప్రైవేటుకు కట్టబెట్టాలన్నదే రైల్వే లక్ష్యమని ఆరోపణ

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): పాత రాజరాజేశ్వరిపేట వాసుల్లో మళ్లీ అలజడి మొదలైంది. ఐదు దశాబ్దాలుగా రైల్వే స్థలాల్లో నివసిస్తున్న పేదలను ఖాళీ చేసి వెళ్లాలంటూ రైల్వే అధికారులు హుకుం జారీ చేశారు. ఇళ్లు ఖాళీ చేయాలంటూ ఈ నెల 18న పాత ఆర్‌ఆర్‌పేట వీధుల్లో దండోరా వేయించడంతో స్థానికులు తీవ్రస్థాయిలో ఆందోళన చెందుతున్నారు.

950 కుటుంబాలకు ఇబ్బంది

నగరానికి దూరంగా ముళ్ల పొదలు, మురుగు మడుగులతో నిర్మానుష్యంగా ఉండే పాత ఆర్‌ఆర్‌పేటలో ఐదు దశాబ్దాలుగా సుమారు 950 మంది పేదలు, విశ్రాంత రైల్వే ఉద్యోగుల కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. ఈ కుటుంబాలు చెల్లించిన పన్నులతో ఈ ప్రాంతంలో క్రమంగా రోడ్లు, డ్రెయిన్లు, మంచినీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను నగర పాలక సంస్థ కల్పించింది. క్రమంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతానికి అన్ని సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కసారిగా ఇళ్లు ఖాళీ చేయాలంటూ రైల్వే శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేయటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు ఈ స్థలాన్ని విక్రయించేందుకే తమను ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



పాత ఆర్‌ఆర్‌పేటలో రైల్వే స్థలాన్ని అక్రమించుకుని నిర్మించుకున్న నివాసాలు



మహంకాళి అమ్మవారిగుడి వీధిలో పేదల ఇళ్లు

2016 నాటి ఘటనలు పునరావృతం

2016లో తమకు స్థలం అవసరమని వెంటనే ఖాళీ చేయాలని పాత ఆర్‌ఆర్‌పేట వాసులకు రైల్వే శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆందోళన చెందిన స్థానికులు నెల రోజుల పాటు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. స్థానికంగా నివసిస్తున్న అన్ని కుటుంబాల వారు రోడ్డుపైకి వచ్చి పెద్ద ఎత్తున ర్యాలీలు చేసి తమ నిరసనను తెలియజేశారు. పార్టీలకు అతీతంగా స్థానికులకు నాయకులు అందరూ మద్దతు తెలిపారు. రైల్వే ఉన్నత అధికారులు, నాటి కేంద్ర మంత్రులను స్థానికులతోపాటు ప్రజాప్రతినిధులు కలిసి వినతి పత్రాలను అందజేశారు.

2021లో రైల్వే మంత్రికి లేఖ రాసిన వైఎస్ జగన్

2021లో రైల్వే స్థలంలో నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సహకరించాలని, ప్రత్యామ్నాయంగా రైల్వే శాఖకు వాంబే కాలనీలో 25 ఎకరాల స్థలం కేటాయిస్తామని అప్పటి కేంద్ర రైల్వే మంత్రి పియూష్ గోయల్‌కు నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి లేఖ రాశారు. దీంతో సమస్య సద్దుమణిగింది. ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రావటంతో సమస్య మొదటికి వచ్చింది. మళ్లీ పాత ఆర్‌ఆర్‌పేట వాసులను ఖాళీ చేయించేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. తాజాగా స్థలాలు ఖాళీ చేయాలని దండోరా వేయించడంతో స్థానికులు మళ్లీ ఆందోళన చేపట్టారు.



అప్పటి కేంద్ర రైల్వే శాఖామంత్రికి సీఎం హోదాలో వైఎస్ జగన్ రాసిన లేఖ

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



50 ఏళ్లగా ఇక్కడే ఉంటున్నాం. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నాం. ఇప్పుడు ఖాళీ చేయమనటం అన్యాయం. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి మమ్మల్ని ఆదుకోవాలి. లేదంటే అందరం రోడ్డున పడతాం.

– రాజేశ్వరి, పాతరాజరాజేశ్వరిపేట

ఇప్పుడు గుర్తుకొచ్చిందా?



ఐదు దశాబ్దాలు గుర్తుకు రాని స్థలం రైల్వేకు ఇప్పుడు కావాల్సి వచ్చిందా? ఈ స్థలంతో అవసరం లేక పోయినా ఖాళీ చేయమనటం భావ్యం కాదు. రైల్వే స్టేషన్‌కు దూరంగా ఉన్న ఈ స్థలం వారికి ఏరకంగానూ ఉపయోగపడదు.

– రమణి, పాతరాజరాజేశ్వరిపేట

ప్రైవేట్ వారికి కట్టబెట్టేందుకే..



ఏరకంగా ఉపయోగపడని ఈ స్థలాన్ని రైల్వేశాఖ స్వాధీనం చేసుకుని ప్రైవేట్ వారికి విక్రయించాలని కుట్ర చేస్తోంది. ఇప్పటికే రైల్వే స్టేషన్‌ను 99 ఏళ్లకు లీజుకు ఇచ్చారు. ఈ స్థలాన్ని కూడా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు.

– సుబ్బయ్య, పాతరాజరాజేశ్వరిపేట

ఖాళీ చేసే ప్రసక్తే లేదు



ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగాం. బతికినంత కాలం ఇక్కడే ఉంటాం. ఖాళీ చేసే ప్రసక్తేలేదు. అప్పులు చేసి ఇళ్లు కట్టుకుని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకున్నాం. ఇప్పుడు ఖాళీ చేయమనటం న్యాయం కాదు. ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలి.

– సురేష్‌బాబు, పాతరాజరాజేశ్వరిపేట

తీరు మారకుంటే చర్యలు తప్పవు

సిబ్బందికి జీజీహెచ్ సూపరింటెండెంట్ హెచ్చరిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోగులకు సేవలు అందించే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్ హెచ్చరించారు. ఇక మీదట చెప్పేది ఏమీ ఉండదని, చర్యలు కఠినంగా ఉంటాయని పేర్కొన్నారు. 'జీజీహెచ్‌లో రోగుల పాట్లు' శీర్షికన ఈ నెల 21న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డాక్టర్ వెంకటేష్ నర్సింగ్ సూపరింటెండెంట్‌తో పాటు, నాల్గో తరగతి ఉద్యోగులను పర్యవేక్షించే అధికారులను పిలిచి గట్టిగా మందలించారు. ఇక మీదట ఇలాంటి ఘటనలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు.

రోగులతో మర్యాదగా వ్యవహరించండి

కొందరు స్టాఫ్‌నర్సులు రోగులతో దురుసుగా మాట్లాడటం, ఏదైనా అడిగితే సమాధానం చెప్పక పోవడం వంటి అంశాలు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్ దృష్టికి వచ్చాయి. దీంతో నర్సింగ్ సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. నర్సింగ్ సిబ్బంది ప్రవర్తనలో మార్పు రావాలని స్పష్టంచేశారు. ఇప్పటికే చాలా మంది మారారని, వందశాతం మార్పు రావాలని ఆయన హెచ్చరించారు. తీరు మారని వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టంచేశారు.

సెమీ కండక్టర్ విభాగంలో అద్భుత ప్రగతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సెమీ కండక్టర్ రంగంలో దేశం అద్భుత ప్రగతిని సాధించిందని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు పేర్కొన్నారు. కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ ఫర్ టెక్సిబులిటీ అండ్ ఫిజికల్ డిజైన్ అంశంపై నిర్వహించిన ఐదు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మల్లికార్జునరావు విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక ఫలితాలు సామాన్యులకు చేరేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. ఆయా రంగాల్లో చోటు చేసుకున్న ప్రగతిని విద్యార్థులకు తెలిపేందుకు ఈ విధమైన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు పొట్టి సురేంద్రకుమార్, కోశాధికారి కె.రాఘవయ్య, రిసోర్స్ పర్సన్లు డాక్టర్ షేక్ అష్రఫీలీ, ఉపేంద్రరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, హెచ్‌ఓడీ ఎం.రంగారావు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందిస్తున్న చలవాది మల్లికార్జునరావు







అలరించిన డ్రోన్ షో





భవానీపురం వద్ద కృష్ణానదీ తీరాన మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రోన్ షో అలరించింది. 5,500 డ్రోన్లతో ఈ షో కొనసాగింది. ఆకాశంలో సుమారు 15 నిమిషాల పాటు డ్రోన్‌లు సృష్టించిన పలు ఆకృతులు కనువిందు చేశాయి. తొలుత ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. జుగల్ బందీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డ్రోన్ షో కారణంగా జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

– భవానీపురం(విజయవాడపశ్చిమ)

విద్యార్థుల తీరును తల్లిదండ్రులు గమనించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఏమి చేస్తున్నారనే అంశాలను తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు సూచించారు. కాకరపర్తి భావనారాయణ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం కళాశాల ఆవరణలో మంగళవారం జరిగింది. డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దటానికి తమ కళాశాల యాజమాన్యం పూర్తి స్థాయిలో కృషి చేస్తోందన్నారు. అదే క్రమంలో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ఏ విధంగా నడుచుకుంటున్నారు, ఏమి చదువుతున్నారనే అంశాలను గమనించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ.. కళాశాలలో జరిగే కార్యక్రమాలు, క్రమశిక్షణ, విద్యార్థినుల భద్రత, హాస్టల్ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ కార్యక్రమ కన్వీనర్ కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించండి

సీడీఎంఏ ఉత్తర్వులు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలో ప్రజారోగ్యం, కంప్యూటర్ ఆపరేటర్‌గా, ఉద్యాన విభాగల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని వీఎంసీ కమిషనర్‌ను సీడీఎంఏ (కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) ఆదేశించింది. కనీస వేతనాలు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వీఎంసీలో పారిశుద్ధ్యం నిర్వహణకు ఔట్ సోర్సింగ్‌లో 2000 మంది, ఉద్యాన విభాగంలో 65 మంది కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లుగా 28 మంది విధులు నిర్వహిస్తున్నారు. వారికి కనీస వేతనం చెల్లించటం లేదని మునిసిపల్ యూనియన్ నాయకుడు ఆసుల రంగనాయకులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ ఏడాది మేలో హైకోర్టు కార్మికులు సమాన వేతనాన్ని చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ వీఎంసీ కమిషనర్ పెడచెవిన పెట్టడంతో పిటిషనర్ కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కింద మళ్లీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రాష్ట్ర మున్సిపల్ శాఖ స్పందించి వెంటనే కార్మికులకు కనీస వేతనాలను చెల్లించాలని సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బైక్ ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సారంగం వద్ద బైక్ ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలు గాయపడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. 48వ శానిటరీ డివిజన్‌లో పోలవరపు లక్ష్మి పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తోంది. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో సారంగం రోడ్డులో విధులు నిర్వహిస్తుండగా బైక్ ఢీకొట్టింది. గాయపడిన లక్ష్మిని వెంటనే కొత్తపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, సీఐటీయూ నాయకుడు వి.సాములు, ఇతర కార్మిక నాయకులు పలువురు లక్ష్మిని పరామర్శించారు. ఆమెకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ అధికారులను కోరారు.

ఆటోనగర్ ఆర్టీసీ డిపోలో మహిళా ఉద్యోగికి గాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆటోనగర్ ఆర్టీసీ డిపోలో బస్సును వెనక్కు నడుపుతుండగా జరిగిన ప్రమాదంలో డిపోలో పని చేస్తున్న మహిళా ఉద్యోగి కాలికి బలమైన గాయమైంది. కృష్ణలంకకు చెందిన ఎం.మరియమ్మ ఆటోనగర్ ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తోంది. మంగళవారం రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో మరియమ్మ బస్‌ను శుభ్రం చేస్తోంది. అదే సమయంలో మరో బస్సును రివర్స్ చేస్తున్న డ్రైవర్ మరియమ్మను గమనించకుండా వేగంగా నడపటంతో ఆమె రెండు బస్సుల మధ్య ఇరుక్కుంది. కుడి కాలికి బలమైన గాయమైంది. డిపో సిబ్బంది ఆమెను వెంటనే కొత్త ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అక్కడి మెరుగైన వైద్యం కోసం ఆమెను తాడేపల్లిలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

ఆలయాల పేరుతో కొనసాగుతున్న ఆక్రమణలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఇక్కడ దసరా ఉత్సవాల పేరిట ఒక ఆలయాన్ని నిర్మించారు. దీనిపై సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురించటంతో స్పందించిన అధికారులు ఆలయాన్ని తొలగించటానికి జేసీబీతో సహా వచ్చారు. అయితే నిర్వాహకులు తమకు కొంత సమయం ఇవ్వాలని తామే ఆలయాన్ని తొలగిస్తామంటూ కోరారు. దీంతో అధికారులు రెండు రోజుల సమయం ఇచ్చి రాతపూర్వకంగా లేఖ తీసుకున్నారు. అయితే మూడు రోజులు గడిచినప్పటికీ ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. ఇది ఇలా ఉండగా ఇక్కడకు అత్యంత సమీపంలో అమ్మవారు వెలిశారంటూ మరో ఆక్రమణకు తెర తీశారు. అమ్మవారు వెలిశారని చెబుతున్న ప్రాంతంలో పందిరి వేసి ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. సమాచారం అందుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇరిగేషన్ సిబ్బందితో కలిసి ఆలయ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. నిర్మాణం చేసిన దిమ్మలను తొలగించాలని అధికారులు కోరారు. ఇక్కడ అమ్మవారు వెలిశారని తమకు కొంత సమయం కావాలంటూ నిర్వాహకులు కోరారు. దీంతో అధికారులు రెండు రోజుల సమయం ఇచ్చి నిర్మాణాలు తొలగించాలని లేనిపక్షంలో తాము చర్యలు తీసుకుంటామంటూ చెప్పి వెళ్లిపోయారు. ఈ ఆక్రమణలకు అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయని అందుకే సమయం పేరిట జాప్యం చేసి అధికారులపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో నిర్మిస్తున్న ఆలయం

రేపు దేశ్ కా ట్రక్కు ఉత్సవ్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): దేశంలో అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ ఈ నెల 24న విజయవాడలో దేశ్ కా ట్రక్కు ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కమర్షియల్ వెహికల్స్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ కౌల్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ట్రక్కింగ్ కమ్యూనిటీని వారికి పనికొచ్చే సూచనలతో బలోపేతం చేయడానికి రూపొందించినట్లు పేర్కొన్నారు. చక్కటి వివరణలతో కూడిన వాహన ప్రదర్శనలు, టాటా మోటార్స్ సమగ్ర విక్రయానంతర సేవల మద్దతుపై వివరణలు ఉంటాయని వివరించారు. కస్టమర్ల అవసరాలను అర్థం చేసుకుని, పరిష్కరించేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు.